# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 30-07-2026                    సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన న్యూఢిల్లీలో ఈరోజు భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (CCS) సమావేశం జరిగింది.
- జాతీయ గౌరవ అవమానాల నిరోధక (సవరణ) బిల్లు-2026ను పార్లమెంట్ ఆమోదించింది.
- పబ్లిక్ పరీక్షల్లో అక్రమాల నిరోధక (సవరణ) బిల్లు-2026ను కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ రాజ్యసభలో ఈరోజు ప్రవేశపెట్టారు.
- ఏ దేశమైనా సమృద్ధిగా అభివృద్ధి చెందాలంటే పౌరులు ఆరోగ్యంగా ఉండటం అత్యంత అవసరమని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయ పేర్కొన్నారు.

======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన న్యూఢిల్లీలో ఈరోజు భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (CCS) సమావేశం జరిగింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు.. వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు తీసుకున్న చర్యలపై ప్రధానమంత్రి సమీక్ష జరిపారు. పౌరుల ప్రయోజనాలను కాపాడే చర్యలను వేగవంతంగా అమలు చేయడానికి, పరిణామాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఒక సమగ్ర సమన్వయ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో ప్రధాని పిలుపునిచ్చారు. అదే విధంగా నావికులకు, వారి కుటుంబాలకు సకాలంలో సమాచారం, అత్యవసర సహాయం, కౌన్సెలింగ్ అందించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రబీ సీజన్‌కు కావలసిన ఎరువుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ ఎరువుల వినియోగంపై ఈ సమావేశంలో చర్చించారు. ఎరువుల సరఫరాకు ఎటువంటి విఘాతం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఘర్షణల వల్ల దేశ పౌరులపై.. అలాగే విదేశాల్లో ఉన్న భారతీయులపై

ఎటువంటి ప్రతికూల ప్రభావం పడకుండా కాపాడేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేయాలని ప్రధానమంత్రి సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ గీతం `జనగణమన`తో సమానంగా `వందేమాతరం` గేయానికి కూడా చట్టబద్ధమైన రక్షణ కల్పించేందుకు ప్రవేశపెట్టిన జాతీయ గౌరవ అవమానాల నిరోధక (సవరణ) బిల్లు, 2026ను (Prevention of Insults to National Honour (Amendment) Bill, 2026) పార్లమెంట్ ఈరోజు ఆమోదించింది. జాతీయ గౌరవ అవమానాల నిరోధక చట్టం-1971ని మరింత సవరించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ చట్టం కింద నేరాలకు పాల్పడితే మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంది. బిల్లుపై జరిగిన చర్చలో నిత్యానంద్ రాయ్ మాట్లాడుతూ... ఈ బిల్లు కేవలం ఒక చట్టసభ సవరణ మాత్రమే కాదని, ఇది భారతీయ సాంస్కృతిక వారసత్వానికి, జాతీయ అస్తిత్వానికి, దేశ స్వాతంత్ర్య సంగ్రామ ఆదర్శాలకు ప్రతీక అన్నారు. వందేమాతరం గేయం దేశ స్వాతంత్య్ర సమరయోధులకు నిరంతర ప్రేరణగా నిలిచిందని అన్నారు. అంతకుముందు చర్చలో పాల్గొన్న డిఎమ్‌కె (DMK) పార్టీ ఎంపీ కె. కనిమొళి ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ.. ఈ బిల్లు దేశ ప్రజలను విడదీస్తుందన్నారు. ఈ బిల్లుకు మద్దతు తెలుపుతూ బిజెపికి చెందిన సంబిత్ పాత్రా మాట్లాడుతూ.. ఈ చట్టం అత్యంత కీలకమైనదని అన్నారు. జాతీయ గేయం వందేమాతరం 150 ఏళ్ల సందర్భంగా గతేడాది నవంబర్ నుండి కేంద్ర ప్రభుత్వం ఏడాది పొడవునా జాతీయ స్థాయి వేడుకలను నిర్వహిస్తోందని చెప్పారు. బిల్లు ఆమోదం పొందిన అనంతరం లోక్‌సభ రేపు ఉదయం 11 గంటలకు వాయిదా పడింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పబ్లిక్ పరీక్షల్లో అక్రమాల నిరోధక (సవరణ) బిల్లు, 2026ను (Public Examinations (Prevention of Unfair Means) Amendment Bill, 2026) కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ రాజ్యసభలో ఈ రోజు ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దేశంలోని విద్యార్థులు, యువత సంక్షేమాన్ని కాపాడేందుకు ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఈ బిల్లు ఉదాహరణ  అని అన్నారు. కొత్త చట్టం ప్రకారం.. ఛార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత రెండు నెలల్లోపు విచారణను, మూడు నెలల్లోపు విచారణ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందని చెప్పారు. పేపర్ లీకేజీలు చాలా తీవ్రమైన సమస్య అని, దేశంలోని వివిధ ప్రాంతాల్లో, అనేక రాష్ట్ర ప్రభుత్వాల్లో, కేంద్రంలోని మునుపటి ప్రభుత్వాల హయాంలో కూడా ఇటువంటి సంఘటనలు నమోదయ్యాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. ఈ బిల్లుపై చర్చ కోసం 7 గంటల సమయం కేటాయించినట్లు ఛైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ తెలిపారు. విపక్ష పార్టీ నేత మల్లికార్జున ఖర్గే చర్చను ప్రారంభిస్తూ.. కొత్త బిల్లులో ప్రభుత్వం కేవలం పైపైన మార్పులు మాత్రమే చేసిందని, ప్రతిపాదిత సవరణలు, పబ్లిక్ పరీక్షల్లో అక్రమాలను అరికట్టడానికి సమర్థవంతంగా పని చేయవన్నారు. ఈ చట్టంలో పదేళ్ల వరకు జైలు శిక్ష, 10 కోట్ల రూపాయల వరకు జరిమానా, దోషులుగా తేలిన నేరస్థుల ఆస్తులను జప్తు చేయడం వంటి కఠినమైన శిక్షలతో సహా పలు కీలక నిబంధనలు ఉన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

సాహస యాత్రను విజయవంతంగా పూర్తి చేసిన `ఐఎఎస్‌వి త్రివేణి` (IASV Triveni) మహిళా నౌకాయాన బృందంతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ రోజు ముఖాముఖిగా మాట్లాడి.. వారి అసాధారణ సాధనను, పట్టుదలను ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ సాహసయాత్ర ద్వారా ఈ బృందం సముద్రాలను జయించడమే కాకుండా..సంక్లిష్టమైన మిలిటరీ కార్యకలాపాలను మహిళలు నిర్వహించగలరా అని ప్రశ్నించే పాతకాలపు ఆలోచనలను సైతం తిప్పికొట్టిందని రక్షణ మంత్రి చెప్పారు. ఈ విజయం దేశంలోని ప్రతి మహిళకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. వీరి విజయం మరింత మంది యువతులను.. సవాళ్లను అధిగమించేలా, దేశ నిర్మాణంలో భాగస్వాములు అయ్యేలా ప్రోత్సహిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో సెమీకండక్టర్ తయారీని బలోపేతం చేయడానికి స్వయం సమృద్ధ (ఆత్మనిర్భర్) సెమీకండక్టర్ ఎకో సిస్టమ్ నిర్మించడానికి ప్రభుత్వం లక్షా 27 వేల 500 కోట్ల రూపాయలు ఆమోదిత నిధులతో 'ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ISM) 2.0' ను ఆమోదించిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్ సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించిన `సిఐఐ సెమీకండక్టర్ డిజైన్, మాన్యుఫాక్చరింగ్‌లో ఆత్మనిర్భరత ముందుకు తీసుకెళ్లడం' అనే సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ పరిశ్రమకు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం విధానపరంగా కట్టుబడి ఉందని, ప్రస్తుత కార్యక్రమాలు అంతర్జాతీయ సెమీకండక్టర్ రంగంలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేసేందుకు గొప్ప అవకాశాన్ని కల్పిస్తున్నాయని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

నషా ముక్త్ భారత్, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను సాకారం చేసేందుకు ఆగస్టు 2న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ `నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్` కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని కేంద్ర యువజన వ్యవహారాల శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ తెలిపారు. ఈ రోజు రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో అడిగిన అనుబంధ ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. దేశాన్ని మత్తుపదార్థాల రహితంగా మార్చేందుకు ఆధ్యాత్మిక సంస్థలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, `మై భారత్` (MY Bharat) యువత అంతా ఒకే వేదికపైకి వస్తున్నారన్నారు. ప్రస్తుతం దేశంలోని యువత ఎక్కువగా మత్తుపదార్థాల బారిన పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏ దేశమైనా సమృద్ధిగా, అభివృద్ధి చెందినదిగా మారాలంటే పౌరులు ఆరోగ్యంగా ఉండటం అత్యంత అవసరమని మన్సుఖ్ మాండవీయ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ నెల 1వ తేదీ నాటికి దేశంలో 10 కోట్ల 58 లక్షల ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన కనెక్షన్లతో సహా మొత్తం 33 కోట్ల 13 లక్షల గృహ వినియోగ ఎల్పీజీ వినియోగదారులు ఉన్నారని పెట్రోలియం, సహజ వాయువు శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి లోక్‌సభలో తెలిపారు. దేశంలోని గృహాలకు సరసమైన ధరలకే ఎల్పీజీ లభ్యతను ప్రభుత్వం నిర్ధారిస్తోందని, ఇందుకోసం ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో 22 వేల కోట్ల రూపాయలు, అలాగే 2025-26, 2026-27 ఆర్థిక సంవత్సరాలలో 30 వేల కోట్ల రూపాయలను పరిహారంగా చెల్లిస్తున్నట్లు మంత్రి చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు పార్లమెంట్ భవనంలో అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ రాష్ట్రాలకు చెందిన పార్లమెంట్ సభ్యులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన చర్చలు రెండు రాష్ట్రాల్లో నెలకొన్న ప్రస్తుత వరద పరిస్థితులపైనే ప్రధానంగా సాగాయని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు. అక్కడి సవాళ్లను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తూనే ఉంటుందని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

స్క్వాష్ క్రీడకు సంబంధించి కెనడాలోని అంటారియోలో జరుగుతున్న `స్క్వాష్ జూనియర్ టీమ్ ఛాంపియన్‌షిప్`లో భారత పురుషుల జట్టు సెమీఫైనల్స్‌కు చేరుకుంది. క్వార్టర్ ఫైనల్స్‌లో ఐదో సీడ్ భారత పురుషుల జట్టు 2-1

తేడాతో ఇంగ్లాండ్‌ను ఓడించి సెమీస్‌కు చేరింది. తదుపరి మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు.. జపాన్‌ను ఓడించి సెమీఫైనల్ చేరిన అమెరికాతో తలపడనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రాబోయే రెండు రోజుల్లో అరుణాచల్ ప్రదేశ్, కేరళం, మాహే, రాజస్థాన్‌లలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ నుండి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హెచ్చరించింది. తీరప్రాంత దక్షిణ అంతర్గత కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, కొంకణ్, గోవాలలో రేపటి వరకు ఇవే తరహా పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. ఇదిలా ఉండగా ఈరోజు మధ్య మహారాష్ట్ర, తెలంగాణ, విదర్భ, పశ్చిమ మధ్యప్రదేశ్ ప్రాంతాల్లో భారీ నుండి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తూ.. IMD రెడ్ అలర్ట్ జారీ చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =